
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9 : కనిష్ఠం 18.5

కామారెడ్డి
జిల్లా వార్తలు

బుధవారం 6 ఆగస్టు 2025





నిల్వ ఉంచిన బ్యాలెట్ బాక్సులు

జిల్లాకు చేరిన బ్యాలెట్ బాక్సులు

- గుజరాత్ నుంచి 1830 బ్యాలెట్ బాక్సులు రాక
- అందుబాటులో ఉన్నవి 3200 బాక్సులు
- స్థానిక ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ బాక్సులను అధికారులు సమకూర్చుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 3200ల బ్యాలెట్ బాక్సులు ఉండగా అదనంగా గుజరాత్ నుంచి మరో 1830 బ్యాలెట్ బాక్సులను తెప్పించారు. ఆ బ్యాలెట్ బాక్సులు కామారెడ్డికి చేరాయి. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకోసం సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. ఓటరు జాబితాను సైతం సిద్ధం చేసే పనిలో పడ్డారు. జిల్లాలో పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఓట్లు వేస్తారు. ప్రతీ ఓటరు రెండు ఓట్లు వేస్తాడు. సాధారణంగా ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ కేంద్రం ఉంటుంది. ఈ విధంగా జిల్లాలో 4,667 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో వార్డులో 650 మంది కంటే అధికంగా ఓటర్లు ఉంటే అదనంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. గత 6 నెలల కిందటే పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు ఓటరు జాబితాను సైతం ప్రకటించారు. కోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఆదేశించడంతో ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. మరోసారి ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. గ్రామ యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపొందించనున్నారు.

ఎన్నికల సిబ్బంది వివరాల సేకరణ

స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తే పోలింగ్ కోసం సిబ్బంది వివరాలను అధికారులు ఆరా తీస్తున్నారు. ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రాకున్నా అందుబాటులో ఉన్న సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. గతంలో నమోదు చేసుకున్నప్పటికీ కొందరు బదిలీ అయి వెళ్లిపోయారు. మరికొందరు పదవి విరమణ చేశారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ఎప్పుడైన నిర్వహించవచ్చనే సమాచారంతో అధికార యంత్రాంగం పోలింగ్ కోసం సిబ్బంది వివరాలను మళ్లీ సేకరిస్తున్నారు.

విధులకు.. రాకున్నా.. వచ్చినట్టు!





- పంచాయతీ కార్యదర్శుల తప్పుడు హాజరు నమోదు
- కారోబార్‌ల సెల్‌ఫోన్లలో డీఎస్ఆర్ యాప్ ఇన్‌స్టాల్
- విధులకు రాకుండానే ఇతరుల ఫొటోలు అప్‌లోడ్
- జిల్లాలో 43 మంది కార్యదర్శులకు నోటీసులు
- జిల్లా వ్యాప్తంగా 536 పంచాయతీలు

కామారెడ్డి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పాలన గాడితప్పుతోంది. కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు రాకున్నా వచ్చినట్లుగా రోజువారి పారిశుధ్య నివేదిక యాప్‌లో తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు జూలైలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల హాజరు నమోదును పరిశీలించారు. ఈ క్రమంలో జిల్లాలో 43 మంది కార్యదర్శులు తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. దీంతో వారికి ఉన్నతాధికారులు చార్జ్ మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణలోపం వల్లనే కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 536 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 521 మంది పంచాయతీ కార్యదర్శులు తమ విధులను నిర్వహిస్తున్నారు.

కార్యదర్శుల హాజరుకు డీఎస్ఆర్ యాప్

గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధులకు సక్రమంగా హాజరయ్యేలా ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫేస్ రికగ్నిషన్ యాప్‌తో కార్యదర్శులు అటెండెన్స్ వేసేందుకు జూలైలో డీఎస్ఆర్ (రోజు వారి పారిశుధ్య నివేదిక) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 11 గంటల లోపు గ్రామానికి వెళ్లి యాప్‌లో తమ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ లోకేషన్‌కు వచ్చి సెల్ఫీ ఫొటోలు తీసుకుని డైలీ శానిటేషన్ రిపోర్టు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం పారిశుధ్య పనులు చేయిస్తూ ఆ ఫొటోలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అదేవారి ముఖ గుర్తింపు హాజరు కూడా కానీ కొందరు యాప్‌లో ఉన్న వెసులుబాటును ఆసరాగా చేసుకుని విధులకు గైర్హాజరు అవుతున్నట్లు అధికారుల తనిఖీల్లో తేలింది.

కారోబార్‌లు, కార్మికుల ఫోన్లలో యాప్

ఈ యాప్‌ను కొందరు కార్యదర్శులు స్థానికంగా ఉండే కారోబార్‌లు, పంచాయతీ కార్మికుల ఫోన్లలో అప్‌లోడ్ చేసి విధులకు హాజరుకాకున్నా హాజరైనట్లు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారని అధికారుల విచారణలో తేలింది. ఇలా పంచాయతీ కార్యదర్శుల ఫొటోలకు బదులుగా కారోబార్‌లు, పంచాయతీ కార్మికులు పనులు చేస్తున్నట్లు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. మరికొందరు సెక్రెటరీలు స్థానికంగా ఉండకపోవడంతో యాప్‌లో తమ ఫైల్ ఫొటోలను అప్‌లోడ్ చేస్తు హాజరు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు పంచాయతీ భవనాలు, కుర్చీలు, ఇతర వస్తువులను అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తోంది. మరికొందరు సెల్‌ఫోన్‌లో ఉన్న కార్యదర్శి సెల్ఫీఫొటోను మరో ఫోన్ ద్వారా ఫొటో తీసి యాప్‌లో నమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శుల పని తీరును పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల పంచాయతీ అధికారులదే కార్యదర్శుల హాజరు నమోదు ఎంపీవో లాగిన్‌లో ఉంటుంది. డీఎల్‌పీవో, డీపీవోలు సైతం తనిఖీలు చేయవచ్చు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కార్యదర్శులు తప్పుడు వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

43 మందికి నోటీసులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 536 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 521 మంది పంచాయతీ కార్యదర్శులు తమ విధులను నిర్వహిస్తున్నారు. ఇందులో గ్రేడ్ -1 నుంచి గ్రేడ్ -4 వరకు, జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు మొదట్లో ఉదయం 9 గంటలకే గ్రామాలకు చేరుకుని పారిశుధ్య పనుల ఫొటోలు యాప్‌లో నమోదు చేసేవారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఉండడంతో సకాలంలో హాజరు కాలేకపోతున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు స్పందించి ఉదయం 11 గంటల వరకు సమయం సడలింపు ఇచ్చారు. కార్యదర్శులు ప్రతి రోజూ ఉదయం 11 గంటలలోపు విధులకు హాజరై అక్కడ పారిశుధ్య సిబ్బంది చేపడుతున్న పనులను డీఎస్ఆర్ యాప్‌లో వారి ఫొటో వచ్చేలా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కానీ కొందరు కార్యదర్శులు విధులకు హాజరు కాకుండానే పారిశుధ్య సిబ్బంది ఇతరుల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో 43 మంది కార్యదర్శులు తప్పుడు హాజరు నమోదు చేశారని గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

నోటీసులు జారీ చేశాం

- మురళి, డీపీవో, కామారెడ్డి

డీఎస్ఆర్ యాప్‌లో తప్పుడు ఫొటోలు నమోదు చేసిన 43 మంది కార్యదర్శులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశాం. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరయ్యే కార్యదర్శులపై చర్యలు తప్పవు.



ఆర్గొండ పాఠశాలలో మొక్కను నాటుతున్న కలెక్టర్, డీఈవో

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

రాజంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): త్వరితగతిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి ఇసుక, మొరం అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ జానకికి సూచించారు. వర్షాకాలం కావడంతో తొందరగా ఇల్లు నిర్మించుకోవాలని ఏదైన సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ప్రాథమిక విద్య పటిష్టంగా ఉంటే తర్వాత తరగతులు సులభంగా చదువ గలుగుతారని ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో పిల్లలకు విద్యతో పాటు మంచి అలవాట్లను నేర్పించాలని సూచించారు. పాఠశాలకి చెందిన ఓ విద్యార్థికి సదరం సర్టిఫికెట్ అందేలా చూడాలని ఎంపీడీవో బాలకృష్ణను ఆదేశించారు. వంటగదిలో పనులు మరమ్మతులు చేయించాలని డీఈవో రాజుకు ఆదేశించారు. పాఠశాలలో ఆవరణలో మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, మండల స్పెషల్ అధికారి అపర్ణ, ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ జానకి, ఎంఈవో పూర్ణ చందర్‌రావు, ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పోచారం ప్రాజెక్టు

నేడు పోచారం ప్రాజెక్టు నీటి విడుదల

నాగిరెడ్డిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల సాగు కోసం బుధవారం ఉదయం పోచారం ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.5 అడుగులు కాగా (1.820 టీఎంసీలు) ప్రస్తుతం ప్రాజెక్టులో 17 అడుగుల (1.244 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు ఖరీఫ్ పంటల సాగు కోసం ఆయకట్టు భూముల రైతులకు నీరందించేందుకు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు నీటిని విడుదల చేస్తున్నట్లు నీటి విడుదల కార్యక్రమానికి జిల్లా నీటి పారుదల శాఖ ఎస్పీ మల్లేష్ హాజరవుతున్నట్లు డీఈ తెలిపారు. ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు నీటి విడుదల కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

భాంసేఫ్ 12వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

తాడ్వాయి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న జరిగే భాంసేఫ్ 12వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గడ్డం రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాంసేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దుబాసి నరేందర్, భాంసేఫ్ సౌత్ ఇండియా ఇన్‌చార్జి రవీంద్ర మాలి, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్‌రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లను

భూస్వాములకు పంచిన రేవంత్ సర్కార్

- దివ్యాంగుల పింఛన్లపై ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రైతు రుణమాఫీపైనే మాట్లాడుతున్నాడు
- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఈ నెల 13న హైదరాబాద్‌లో మహాగర్జన
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కామారెడ్డి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ద్వివ్యాంగుల పింఛన్లను రైతు రుణమాఫీ రూపంలో భూస్వాములకు రేవంత్ సర్కార్ పంచి పెట్టిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో గల లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించిన వికలాంగుల మహాగర్జన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కంటే రెండు నెలల ముందు వికలాంగులకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు, తదితర వర్గాలకు పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని అన్నారు. ఎన్నికల్లో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేసి దాదాపు 20 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఆ హామీని అమలు చేయలేదని అన్నారు. ప్రతీ ఒక్కరికి ఉన్న పింఛన్‌తో పాటు రూ.2000లు అదనంగా పెంచి ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా నెలకు రూ.వెయ్యి కోట్లు పింఛన్‌దారులు నష్టపోతున్నారన్నారు. అంటే 20 నెలల్లో రూ.20కోట్లు లబ్ధిదారులకు అందకుండాపోయాయని అన్నారు. ఈ డబ్బులను రైతు రుణమాఫీ పేరిట భూస్వాములకు అందించారని తెలిపారు. వికలాంగుల డబ్బులను భూస్వాములకు అందించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ భూస్వాములకు డబ్బులను అందిస్తుంటే ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ ప్రశ్నించడం మానేసి రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మాత్రం ప్రశ్నిస్తున్నాడని అన్నారు. ఏ ఒక్కనాడు కూడా బడుగు బలహీన వర్గాల పింఛన్‌దారులకు అందాల్సిన రూ.4వేలు, రూ.6వేలు పింఛన్లపై మాట్లాడింది లేదని మండిపడ్డారు. గడిలో పుట్టి పెరిగిన కేసీఆర్‌కు, బంగ్లాలో పెరిగిన రేవంత్‌రెడ్డి పింఛన్లపై ఆధారపడి జీవించే వారి కష్టాలు ఏమి తెలుసని మండిపడ్డారు. వికలాంగులకు, ఇతర వర్గాలకు పెంచి ఇవ్వాల్సిన పింఛన్లపై ఈ నెల 13న హైదరాబాద్‌లో మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వికలాంగులు, ఇతర వర్గాల ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సూర్యవంశీ సుజాత, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజాగౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంతేన్ సమ్మెల్, యాదగిరి,

రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరమే కూలిందని ప్రచారం చేయడం సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 85 పిల్లర్లలో రెండు పిల్లర్లు కుంగితేనే కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం కూలిందని అసత్య ప్రచారం చేయడం సిగ్గు చేటని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తన నివాసంలో హైదరాబాద్ నుంచి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్‌లు, జిల్లాలోని ముఖ్య నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతులకు నీరు అందించేందుకు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారాలు చేయడమే కాకుండా మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావులను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని అన్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తామని చెప్పి రెండేళ్ల అయినా ఇంత వరకు వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులు తదితర వర్గాలను మోసం చేస్తూనే ఉందని అన్నారు. కేవలం ఢిల్లీకి కమీషన్‌లు మోసుకు పోయేందుకు మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితేనే ప్రాజెక్ట్ మొత్తం కూలిందనే విధంగా రచ్చ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ గ్రామ, మండల శాఖలతో సమన్వయం చేసుకుంటూ కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య పాలనను ప్రజలకు వివరిస్తూ మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ జుబ్బేర్, నాయకులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, రవి యాదవ్, బల్వంత్‌రావు, గెరిగంటి లక్ష్మీనారాయణ, మాసుల లక్ష్మీనారాయణ, ప్రభాకర్ యాదవ్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న



సదాశివనగర్ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

సదాశివనగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కళాశాలలో అందజేస్తున్న విద్యావిధానంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ కళాశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామారెడ్డి డివిజన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి అధ్యాపకులు అందరితో కలిసి మళ్లీ స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ చేపట్టాలని అన్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులను వారి యొక్క తల్లిదండ్రులకు తెలియజేసి గైర్హాజరు అవుతున్న కారణాలను తెలుసుకుని విద్యార్థులు సక్రమంగా కళాశాలకు రప్పించేందుకు కృషి చేయాలన్నారు. కళాశాలలో ఫిజిక్స్ వాలాఖాన్ అకాడమీ ద్వారా నీట్, జేఈఈ మెయిన్స్‌కి ఉపయోగపడే ఆన్‌లైన్ వీడియో క్లాస్‌లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు పూర్తి ఉచితంగా అందిస్తుంది. కావున ప్రతీ ఒక్క విద్యార్థి వీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఆయా కళాశాలల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ విభాగానికి రూ.10 వేలు, మేయింటనెన్స్ విభాగానికి రూ.16 వేలు, మైనర్ రిపేర్ కోసం రూ.16 లక్షలు సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విడుదల అయ్యాయని, అందులో మొదటి విడతగా రూ.4లక్షలు వచ్చాయని అన్నారు. కళాశాల ఆవరణలో ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ మండల అధికారి షేక్ సలాం, కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కాలభైరవ స్వామి ఆలయంలో

సింధూర పూజలు

రామారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు సంతతధారాభిషేకం, క్షీరాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, జగిత్యాల తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరైన మొక్కలు చెల్లించుకున్నారు.



ఫకీరానాయక్ తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఆర్ఏఈ

అంగన్‌వాడీ భవన

నిర్మాణ పనుల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నసురుల్లాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫకీరా నాయక్ తండాలో 'అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు' అని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పీఆర్ ఏఈ గోపీనాథ్ పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. కాగా నిధులు నిలిచిపోవడంతో, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని తెలిపారు.

నస్రుల్లాబాద్‌లో గ్రామసభ

నస్రుల్లాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం పంచాయతీ సిబ్బంది గ్రామసభలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయా శాఖల అధికారుల నుంచి గ్రామానికి సంబంధించిన వివరాలను తీసుకొని పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్‌లో నమోదు చేస్తామన్నారు. 2023-24 సంవత్సరానికి చెందిన అధికారుల వద్ద నుంచి వివరాలను సేకరించారు.

వరిసాగులో మెలకువలు పాటించాలి: ఏవో



అక్లూర్‌లో వరిపంటను పరిశీలిస్తున్న ఏవో శృతి

వేల్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో మెలకువలు, జాగ్రత్తలను రైతులు తప్పనిసరి పాటించాలని మండల వ్యవసాయాధికారిణి శృతి రైతులకు సూచించారు. మంగళవారం వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం పథకం కింద ఈ సీజన్‌లో ఎడ్మాల సురేందర్ సాగుచేసిన ఆర్‌డీఆర్ -1200 రకం వరిక్షేత్రంను ఆమె సందర్శించి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిసాగులో అధిక దిగుబడులు పొందాలంటే మెలకువలు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాగురీతిని ఆదా చేయుట కోసం వరిలోని తడి పొడి సాగువిదానం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సాగు పద్ధతిని మండలంలోని అన్ని గ్రామాల రైతులందరు పాటించి సాగునీటిని వృదాకాకుండా చేసుకోవాలని సూచించారు. వరిలో కలుపు తొలగించుకున్న తర్వాత పొట్టదశ వరకు ఉన్న సమయంలో ఎక్కువ నీరు అవసరం ఉండదన్నారు. అందుకు తడిపొడి విదానాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయిరాం రాజ్, సుస్థిర వ్యవసాయ మండల కోఆర్డినేటర్ చింత శ్రీనివాస్, హరీష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తాం

● జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



నీలాలో భూమిపూజ చేస్తున్న పల్లె గంగారెడ్డి



అబ్బాపూర్(ఎం)లో..

రెంజల్,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటింటికి తీసుకెళ్తామని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నీలా, రెంజల్, దూపల్లి గ్రామాలలో ఎంపీ అరవింద్ నిధులతో మంజూరైన హనుమాన్ వ్యామయ శాల, కమ్యూనిటీ హాల్ భవనాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డిలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం గత 11సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర పథకాలను ప్రజలకు అందించలేదన్నారు. గత ప్రభుత్వాల వైఫల్యాలతో సంక్షేమ పథకాలను గడప గడపకు అందలేకపోయ్యాయని అన్నారు. కేంద్రం నుండి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నిరెత్తనట్లు వ్యవహరించడంతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుకుండా పోతున్నాయన్నారు. నరేంద్ర మోడీ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ ప థకాలను అమలు చేస్తున్నారని వాటిని ప్రతి ఇంటింటికి చేరవేయాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం ఆరు నెలల్లో ఎలక్షన్‌లు పెట్టకపోతే కేంద్రం నిధులు రావాల్సి తెలిసి ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము ధైర్యం ఉంటే ఎలక్షన్‌లు నిర్వహించాలన్నారు. భారత్‌ను విశ్వగురువుగా చేసిన ఘనత నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని అన్నారు. అనంతరం ఇంటింటికి బీజేపీ ఇంటింటికి బూత్ అధ్యక్షులు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటింటికి చేరుస్తామని అన్నారు. రాష్ట్ర ప్రబుత్వాలు కేంద్రం వెచ్చించిన నిధులను రాష్ట్రాలకు ఉపయోగించుకుని సంక్షేమ నిధులను ప్రజలకు అందించాలన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు యోగేష్, మాజీ మండల అధ్యక్షులు మేకసంతోష్,చుక్కరాజు, కిషోర్, మాజీ ఎంపీపీలోలపు రజిని,బీజేపీ ప్రధానకార్యదర్శి ప్రసాద్,ఈర్లరాజు,బీజేపీనాయకులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో మంగళవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు వెళ్లి కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు సంక్షేమ పథకాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ వీ.మోహన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు నరిన్, శ్రీధర్, ఆనంద్, రాజేందర్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, భూషణ్,భాను, రాధతదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మంగళవారం బూత్ సంపర్క్ అభ్యాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని బూత్ నెంబర్ 43, 44లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రావు, శ్యామల, నవీన్, మహేష్, శ్రీనివాస్, శ్యామ్, సాయిలు, శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద జరు గుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులను చేపట్టి వేగవంతం చేయాలని గణేష్ నిమజ్జనం కోసం ర్యాంపు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. అలాగే మామిడిపల్లిలోని బస్తీ ఆసుపత్రిని సందర్శించి మందుల వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకు న్నారు.పట్టణంలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లను పరిశీలించి అద్దె బకాయిలు ఉన్న లీజ్ దారులకు నోటీసులను అందజేశారు. నిర్ణీత కాలవ్యవధిలో అద్దెను చెల్లించకుంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శేఖర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వృద్ధుడి మృతి

లింగంపేట,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):లింగంపేట మండలంలోని పర్మల్ల ఆగం చెరువులో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి అయ్యపల్లితండాకు చెందిన దేవాసోత్ రాములు(62) మృతి చెందినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. రాములు తన భార్య పశువులను మేపడానికి ఆగపల్లి శివారుకు వెళారు. పర్మల్ల ఆగం చెరువులోకి పశువులు దిగడంతో వాటిని బయటకు కొట్టుకురావడానికి రాములు చెరువులోకి వెళ్లగా అతనికి ఈతరాకపోవడం తో చెరువులో ఉపాధి హామీ పనుల్లోను, మిషన్‌కాకతీయ పనుల్లోను తీసిన గుంతలోపడి మృతిచెందినట్లు మృతుని భార్య ఫిర్యాదు మేరకుకేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

నవీపేట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన మండలంలోని జన్నేపల్లికి ప్రశాంత్, నాందేడ్‌కు చెందిన మహేష్ గోవింద్ రావులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారని ఎస్సై వినయ్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్సైపేర్కొన్నారు.

పోసానిపేట్‌లో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత:ఎస్సై

రామారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోసానిపేట్ గ్రామ స్టేజీ వద్ద అనుమతి లేకుండా తరలిస్తున్న ఇటుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రామారెడ్డి ఎస్సై లావణ్య పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోసానిపేట్ గ్రామానికి చెందిన తంకరి రాజేందర్, తంకరి నారాయణ ఇటుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. అక్రమంగా అనుమతి లేకుండా ఇటుక ట్రాక్టర్ల ద్వారా ప్రజలకు అమ్ముకున్నారని ఫిర్యాదు పోసానిపేట్ గ్రామశివారులో గల గోకుల్ తండా గ్రామస్టేజీ వద్ద సాయంత్రం ఇసుకట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సైలావణ్య వివరించారు.

ఒకరికి జైలు శిక్ష

ముప్కాల్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):బాల్కొండ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలో పట్టుబడ్డ వ్యక్తికి ఒకసంవత్సరం జైలుశిక్షతో పాటు రూ.రెండువేల జరిమాన విధించినట్లు ఎస్సై శైలేందర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు.గత సంవత్సరం బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో ఒక వైన్స్‌లో షెటర్ పగులగొట్టి రూ.14వేల నగదు,కొన్ని మందుబాటళ్లను దొంగిలించిన కేసులో పట్టుబడ్డ నిర్మల్ మండలానికి చెందిన నట్ట పోశెట్టి ప్రథమ శ్రేణిన్యాయాధికారి నెల్లిసరళరాణి ఒకసంవత్సరం జైలు, రూ.రెండు వేల జరిమాన విధిస్తు తీర్పు వెల్లడించారని ఎస్సై శైలేందర్ తెలిపారు.

పేకాట రాయుళ్లకు జరిమానా

కోటగిరి,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ 14మంది జూదరులకు బోధన్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒక్కొక్కరికి రూ.రెండు వేల చొప్పున రూ.28వేల జరిమాన విధించినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. గత నెల 17వ తేదీన ఎత్తొండ గ్రామంలో ఓ రైస్‌మిల్ వెనుక పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి జూదర్లను పట్టుకుని కోర్టులో హాజరుపర్చామన్నారు. నిందితులకు రూ.రెండు వేల చొప్పున జరిమాన విధించారని ఆయన తెలిపారు.

పాముకాటుతో మహిళా మృతి

మహమ్మద్‌నగర్,ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి):పాముకాటుతో మహిళామృతి చెందిన సంఘటన మహమ్మద్‌నగర్ మండ లంలోని పిప్పిరెడ్డిపల్లి తండాలో చోటుచేసుకుంది. మండ లంలోని హసన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పిప్పి రెడ్డితండాకు చెందిన మమత (28)రోజు మాదిరిగానే తం డాలోని పంట పొలంలో కలుపు తీస్తుండగా పాము కాటు వేసింది. పాము కాటు వేయగానే లబోదిబోమంటూ పక్క నే ఉన్న వారికి సమాచారం అందించింది. దీంతో వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స నిర్వహిస్తున్న సమయంలో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. మృతురాలికి కుమార్తె,కుమారుడు ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి జైలు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వ్యక్తికి సంవత్సతరంపాటు జైలుశిక్ష విధిస్తూ ఎస్సీఎస్టీ కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... 24 డిసెంబర్ 2020 రోజున తన కొడుకును కులం పేరుతో దూషించి, దాడిచేశాడని మిర్చి కంపౌండ్‌కు చెందిన దుర్గయ్య ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు క్రాంతికుమార్‌పై కేసు నమోదు చేసి సాక్షాధారాలతో కోర్టులో దాఖలు చేయగా, పోలీసు వారి తరఫున పీపీ బట్టు వసంత్ వాదనలు వినిపించగా, విచారణ అనంతరం కాంత్రి కుమార్‌కు ఒక సంవత్సరం జైలుశిక్షతోపాటు రూ.2400 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సైబర్ క్రైమ్‌లో డబ్బుల రికవరీ

కోటగిరి,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):సైబర్‌క్రైమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి రూ.5వేల రికవరీ అయినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు.ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన కోటగిరి గ్రామానికి పాకల నడిపి సాయిలు అనే వ్యక్తికి అనుమానాస్పద లింక్ మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను అతను ఓపెన్ చేయగా సైబర్ నేరగాళ్లు అతని సిమ్‌ట్రాప్ చేసి అతనికి వచ్చే మెసేజ్‌లను వేరే నెంబర్‌కు వెళ్లేలా చేసి బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫార్మర్ చేయించుకున్నారన్నారు. ఈవిషయమై తమకు ఫిర్యాదు చేయగా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా రూ.5వేల రికవరీ చేశామన్నారు.ఈసందర్భంగా ఎస్సై సునీల్ మాట్లాడుతూ లింక్‌లను, అనుమానాస్పద అప్లికేషన్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దన్నారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకున్నట్లయితే 1930కి కాల్ చేయాలని సూచించారు.

ఇసుక డంప్‌ల సీజ్

కోటగిరి,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. మండలంలోని పొతంగల్, కొడిచర్ల గ్రామాలలో ఇసుక అక్రమ డంప్‌లను సోమవారం రాత్రి గుర్తించి సీజ్ చేశామన్నారు. సుమారు 30ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను సీజ్ చేసి ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించామన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

32క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

» బొలెరో వాహనం సీజ్ కేసు నమోదు



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

గాంధారి,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ఇరత రాష్ట్రాలకు తరలిస్తుండగా గాంధారి ఎస్సై ఆంజనేయులుమండలంలోని గౌరారం గ్రామ సమీపంలో మంగళవారం పట్టుకున్నారు. ఎస్సైతెలిపిన వివరాల ప్రకారం తాడ్కోల్ గ్రామానికి చెందిన అందె మనోహర్ వివిధ గ్రామాల నుండి రేషన్ బియ్యం కొనుగోలు చేసి వేరే రాష్ట్రాలకు తరలించి విక్రయిస్తున్నాడు. దినిలో భాగంగా వివిధ గ్రామాల్లో సేకరించిన 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వేరే రాష్ట్రానికి బొలేరో వాహనంలో తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మనోహర్‌తో పాటుగా బొలేరో వాహన డ్రైవర్ మహ్మద్ ఉమేర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎవరైనా ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ పనుల పరిశీలన



గ్రంథాలయ భవన పనులను పరిశీలిస్తున్న గ్రంథాలయ చైర్మన్

రెంజల్,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయం నిర్మాణ పనులను మంగళవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులను చేపట్టాలని, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రంథాలయ భవనానికి ఇనుప తలుపులను బిగించడంతో వాటిని తొలగించి వేరే తలుపులను బిగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జిల్లాలో 24గ్రంథాలయాలు ఉంటే వాటిలో ఏ ఒక్కదారికి కూడా ఇనుప తలుపులు లేవని వాటిని తొలగించి వేరే వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరితగతిన భవనాన్ని పూర్తి చేస్తే గ్రంథాలయ పాఠకులకు మెరుగైన సదుపాయల కోసం ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీను, మాజీ సర్పంచ్ జావీదోద్దీన్, బోగిడి రవికుమార్, సాయాగౌడ్, అసాని అనిల్, డైరీ సాయిలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్లయ్య ఫారం తండాలో తీజ్ పండుగ



తీజ్ పండుగ నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్లయ్య ఫారం తండాలో మంగళవారం సాయంత్రం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. 9రోజుల పాటు నిష్టతో పెంచిన గోధుమ మొలకల బుట్టలను బాలికలు, యువతులు తలపై పెట్టుకుని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు జగదాంబ ఆలయం, సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ ప్రకారం నిర్వహించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాము, భాను నాయక్, పీర్ చంద్, వసంత్, రతన్, శివలాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయం వద్ద పరిసరాలు శుభ్రపర్చాలి

బోధన్,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణం చెక్కి తలాబ్ కాలనీలో ఉన్నట్టువంటి కట్ట పోచమ్మ గుడి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని 28వ వార్డు బీజేవైఎం అధ్యక్షులు ఏనుగంటి గౌతం కుమార్ అన్నారు. మంగళవారం బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ గుడి ఆలయానికి వంద సంవత్సరాల చరిత్ర ఉందని అమ్మవారి విశిష్టతను పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ పరిసరాలను నిత్యం శుభ్రపర్చి భక్తులకు సౌకర్యంగా ఉంచాలని విన్నవించారు. ఆలయ పరిసరాలలో అసాంఘిక కార్యకలాపాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు విజయ్, గంగాసాగర్, లింగం, శ్రీకాంత్, కిరణ్, వెంకటేష్, దీపక్, కళ్యాణ్, ప్రసాద్, ఆకాష్, వినోద్‌లతో స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

రెంజల్,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై మంగళవారం విద్యార్థులకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలని వీటి ద్వారా వారి తల్లిదండ్రులకు సూచించాలన్నారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. వాహనాలకు సరైన పత్రాలు ఉండాలన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఫెరోజ్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హైకోర్టు న్యాయాధికారికి వినతి



న్యాయాధికారికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఆర్మూర్ ,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ న్యాయస్థానంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైకోర్టులో ఉన్నఆర్మూర్ న్యాయస్థానపోర్టు పోలియో జడ్జీమాధవిలతకు ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు.బార్‌అసోసియేషన్‌అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో న్యాయాధికారి మాధవిల తను కలిసిన న్యాయవాదులు ఆర్మూర్ న్యాయస్థానంలోని సమస్యలను వివరించి వాటిని పరిష్కరిం చాలని కోరారు. జడ్జీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్మూర్‌బార్ అసోసియేషన్‌కార్యవర్గ సభ్యులు,న్యాయ వాదులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు బినోల విద్యార్థిని

నవీపేట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ బినోలకు చెందిన జే.తేజశ్విని అనే 6వ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొనడానికి ఎంపికైందని పాఠశాల పీఈటీ కిషన్ తెలిపారు. ఈ నెల 7న జనగామలో జరిగే అండర్-12 రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో తేజశ్విని ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో తేజశ్విని ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

బీఎస్పీ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బోధన్,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బోధన్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర కార్యదర్శి గంగాధర్ గైని తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి అసెంబ్లీ వరకుపార్టీని బలోపేతం చేస్తూ ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రానున్న స్థానిక ఎన్నికలకు సిద్దంగా ఉండాలని ఆయన కార్యకర్తలకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సింగడి పాండు, జిల్లా అధ్యక్షులు నీరడి రవి, అసెంబ్లీ నీరడి శంకర్, బాగారే గంగాధర్, జిల్లాలోని బీఎస్పీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఐటీఐలో నేటి నుంచి వాక్ ఇన్ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

కమ్మర్‌పల్లి,ఆగస్టు 5:(ఆంధ్రజ్యోతి) నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరంనకు గాను నేటి నుండి వాక్ ఇన్‌స్పాట్ అడ్మిషన్‌లు జరుగుచున్నాయని ఆసక్తిగల విద్యార్థులు దకాస్తులు చేసుకోవాలని బషీరాబాద్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కోటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు ఆగస్టు 6 నుంచి ఆగస్టు 28 వరకు జరుగుతాయన్నారు. 16 సంవత్సరాలుపైబడిన అభ్యర్థులు అర్హులని, కోర్సుల వివరాలు, విద్యార్హతలకు వెబ్ సైట్ చూడాలన్నారు అదనపు సమాచారం కోసం 850066380 8106795400 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

వేల్పూర్ పాఠశాలకు మార్చ్‌ఫాస్ట్, గేమ్స్ డ్రెస్సులు వితరణ

వేల్పూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫీపుల్స్ వారియర్స్, హెల్పింగ్ అండ్ స్వేచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇజ్రాయేల్‌లో ఉంటున్న వారి మిత్రుడు ప్రేమనందం జన్మదినం పురు స్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు మార్చిఫాస్ట్, గేమ్స్ దుస్తువులతో పాటు, సౌండ్ సిస్టం అందజేశారు. సుమారు రూ.70వేల విలువగల 40 మార్చిఫాస్ట్, 35 గేమ్స్ కు సంబందించిన దుస్తువులతో పాటు ఒకసౌండ్ సిస్టం సామగ్రిని హెచ్‌ఎం రాజన్నకు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రేమనందం మిత్రులు ఆర్మూర్ నిఖిల్, అంక్సాపూర్ నిఖిల్, చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఏఏపీ చైర్మన్ హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామం కారెపల్లికి చెందిన మూడవత్ అరవింద్, మూడవత్ మహేందర్ ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించినందుకు గ్రామస్థులు బాసర ట్రిపుల్ ఐటీలో ఒకరు , మహబూబ్ నగర్ ట్రిపుల్ ఐటీలో ఒకరు సీట్లు సాధించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాకులు జేజే నర్సయ్య, అనంత్‌రావు, కుంట రమేష్, గోపాల్, సురేందర్, సీసీ నరేస్, బాపులాల్ నాయక్, రవి నాయక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు కరెంట్ అందించాలని వినతి

ముప్కాల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించి తమకు నాణ్యమైన త్రీఫేజ్ కరెంట్ అందించాలంటూ అధికారులను కోరారు. తీవ్రమైన ఎండలకు పంటలు ఎండిపోతున్నాయని 24 గంటలు త్రీఫేజ్ రెంట్ కరెంట్ అందించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెంటు రాజేశ్వర్, నర్సయ్య, అంబటి సాయన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రీప్రైమరీలో బోధించడానికి దరఖాస్తులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపేట్ ప్రాథమి కోన్నత పాఠశాల, పుప్పాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీప్రైమరి సెక్షన్ పాఠ శాలలను ప్రభుత్వం మంజూరు చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో బోదించడానికి కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండా లన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 7వ తేదీన సంబందిత పాఠశాల ప్రధానోపా ధ్యాయులకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఆయా పోస్టు కోసం ధరఖాస్తు చేసుకునే అర్హులైన అభ్యర్థులు ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన అభ్యార్థులు వీటికోసం ధరఖాస్తులు చేసుకోవాలన్నారు.

తల్లిపాల వారోత్సవాలు



తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోస్లీలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సాలూర: పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవని మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్, సెక్టార్ సూపర్‌వైజర్ గంగావేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం సాలూర రెండవ సెక్టార్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని స్పష్టం చేశారు. ఎలాంటి సందేహాలు ఉన్న డాక్టర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ గంగావేణి, అంగన్‌వాడీ టీచర్‌లుసునీత, గంగామణి, గోదావరి,సరోజ, మహదేవి ఉన్నారు.

ఏర్గట్ల:మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇట్టి కార్యాక్రమంలో ఐసీడీఎస్ పీడి రసూల్, సీడిపివో స్వర్ణలత, ఏసిడీపివో సూపర్‌వైజర్ సరస్వతి పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన, శ్రీమంతాలు, అక్షరాభ్యాసం చేయించి, తల్లిపాల ప్రాముఖ్యతపై గర్బిణీలకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. 6వ తరగతి నుండి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ సీఈసీలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 12లోగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

వరలక్ష్మీ వ్రతానికి విరాళం

ముప్కాల్ ,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన శుక్రవారం దేవి మందిరంలో వరలక్ష్మీ పూజ నిర్వహించుటకు రూ.20వేలు గుండు హన్మంత్‌రావు కమిటి సభ్యులకు అందజేశారు. వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శుక్రవారం దేవి కమిటి సభ్యులు కంచు గంగాధర్, కట్ట మహేష్, దాసరి నర్సింగ్‌దాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలపట్ల ప్రజలుజాగ్రత్తలు వహించాల ని మున్సిపల్ కమిషనర్‌రాజు తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 27, 30వ వార్డులలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్ర మంలో భాగంగా తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమలో మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌలి, ఇన్‌చార్జీ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్,వార్డు ఆఫీసర్లు, జవాన్లు, మెప్మాఆర్పీలు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక చేయూత

సాలూర,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రానికి చెందిన మేదర్ సాయిలు అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతుడి కుటుంబం కటిక నిరుపేదలు. గ్రామ యువకులు, గ్రామస్థులు అంత్యక్రియల నిర్వహణ కొరకు ఆర్థిక సహాయం అందజేశారు. సహాయం చేసిన వారందరికీ బాధ్యత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, గ్రామస్థులు ఉన్నారు.

నాట్యంలో జక్కుల లక్ష్మీ ప్రతిభ

ముప్కాల్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని శిర్డిలో సాయి సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహించిన బారత నృత్య ఉత్సవంలో పాల్గొన్న నాట్యమయూరి ముప్కాల్ కు చెందిన జక్కుల లక్ష్మీ పాల్గొని మంచి ప్రతిభ కనబర్చినట్లు తల్లి దండ్రులు జక్కుల రమాదేవి, ప్రవీణ్ తెలిపారు. ప్రతిభ కనబర్చినందుకు కన్సలేషన్ బహు మతి లభించినందుకు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.


కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామాల మధ్య ఉధృతంగా పారుతున్న అలుగు (ఫైల్)

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడో?

• కోమటిపల్లి, నికాల్‌పూం గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు
• వానాకాలం అలుగు ఉధృతికి స్తంభిస్తున్న రాకపోకలు

డొంకేశ్వర్ , ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్, కోమటిపల్లి గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రహదారి వెంట అలుగు ఉధృతిగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మిస్తే కోమటిపల్లి నుంచి నికాల్‌పూర్ వెళ్లడానికి సులభంగా ఉంటుంది. ఈ రోడ్డు డొంకేశ్వర్ నుంచి ఉమ్మెడి మీదుగా పంచగూడ వరకు ఉంది. ఈ మార్గంలో నిత్యం కార్లు, బైక్‌లపై వందల సంఖ్యలో ప్రయాణిస్తారు. ఈ రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామ ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. వర్షాకాలంలో కోమటిపల్లి ప్రజలు డొంకేశ్వర్ కార్యాలయ పనుల నిమిత్తం రావాలంటే షాపూర్‌వైపు నుంచి వస్తున్నారు. నికాల్‌పూర్ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లాలంటే కోమటిపల్లి వైపు షాపూర్‌మీదుగా తిరిగి వెళ్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వాగు అలుగు ఉధృతి పెరిగి రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. వర్షాకాలంలో వాగు దాటుతుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. నీటి ఉధృతికి వాగులో పడి ఇప్పటివరకు అనేకమంది గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామాల అవతల వ్యవసాయ భూములు ఉండడంతో నిత్యం ఇబ్బందులు పడుతు వాగుదాటాల్సి వస్తుందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రెండు గ్రామాల స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి
• సీహెచ్ మహేష్, కోమటిపల్లి గ్రామం



వర్షాకాలంలో అలుగు ఉధృతంగా పారి వాగు దాటే సమయంలో రైతులు, వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహనం ఎక్కువ ఉండి దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో వివిధ అవసరాల నిమిత్తం వందల సంఖ్యలో రైతులు ప్రయాణిస్తారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపడితే మా కష్టాలు తీరుతాయి.


బహుమతులు అందుకుంటున్న వరంగల్ జట్టు


బహుమతులు అందుకుంటున్న నిజామాబాద్ జట్టు

తెలంగాణ ట్రాన్స్‌కో అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో
విజేతగా వరంగల్, రన్నర్‌గా నిజామాబాద్ జట్లు

సుభాష్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రాన్స్‌కో అంతర్ జిల్లాల హాకీ టోర్నమెంట్ విజేతగా వరంగల్, రన్నర్‌గా నిజామాబాద్ జట్లు నిలిచాయి. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన సెమీ ఫైనల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో వరంగల్, నిజామాబాద్ జట్లు గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు వర్షం కురవడంతో ఫైనల్ మ్యాచ్‌ను షూట్‌ఔట్‌కు కుదించారు. షూట్‌ఔట్ పోటీలలో వరంగల్ 3గోల్స్ చేయగా నిజామాబాద్ జట్టు 1గోల్‌తో సరిపెట్టుకుంది. దీంతో 3-1 తేడాతో వరంగల్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్ఈలు పీవీ రావు, ఆర్.రవీందర్‌లు హాజరై బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు ఓటములను క్రీడాస్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఉద్యోగులు ప్రతీరోజు వ్యాయామం చేస్తూ కొంత సమయాన్ని ఆటలకు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఈలు రమేష్, ఆర్గనైజర్లు తోట రాజశేఖర్, సురేష్‌కుమార్, శంకర్ నాయక్, స్పోర్ట్స్ సెక్రెటరీ గోపి, ఉత్తమ్, దినేష్, మూర్తి, సీనయ్య, సతీష్, సుభాన్, పటాన్, సత్యనారాయణ, ఎంపైర్‌లుగా స్వామి, శ్రీకాంత్, హరీష్, గంగాధర్‌లు వ్యవహరించారు.

ఏడీఈ తోట రాజశేఖర్‌కు సన్మానం

జాతీయ రెడ్‌క్రాస్ అవార్డు గ్రహిత ఏడీఈ తోట రాజశేఖర్‌ను విద్యుత్ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్‌తో పాటు సమాజ సేవలో ముందుంటూ స్వయంగా 84 సార్లు రక్తదానం చేసిన తోట రాజశేఖర్‌ను అభినందించారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు


జెండా వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


జాతరలో కొనుగోలు చేస్తున్న మహిళలు

ఘనంగా జెండా బాలాజీ జాతర

• ఆర్మూర్ పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి తరలించిన భక్తులు • పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

పెర్కిట్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జెండాగల్లిలో గల జెండా బాలాజీ ఆలయంలో మంగళవారం సర్వసమాజ్ ప్రజా ఐక్యసమితి ఆధ్వర్యంలో జెండా జాతరను ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా విచ్చేసి వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. జాతరకు విచ్చేసిన పిల్లలు, పెద్దలు జాతరలోని ఆటవస్తువులు, మహిళలు గాజులు, తినుబండారాలు కొనుగోలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి విచ్చేసి జెండాకు ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వర ఆలయంలో వేదమంత్రోచ్ఛరణల మధ్యపూజలు చేసి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు ఐక్యమత్యంతో ఉండి పండగలన్నింటిని ఘనంగా జరుపుకోవాలని, రాబోయే తరం వారికి పండుగల ప్రాధాన్యం గురించి, జాతర గురించి అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా ఈఆర్ ఫౌండేషన్ ఈనవతి రాజశేఖర్ విచ్చేసి జెండాబాలాజీని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్వసమాజ్‌ప్రజా ఐక్యసమితి అధ్యక్షుడు కొట్టాల సుమన్, కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు.


ఆలయంలో వద్ద భక్తులు


తమలపాకులను పేరుస్తున్న జంటలు

మారుతి మందిరంలో ప్రత్యేక పూజలు

• లక్ష తమలపాకులతో 101 జంటల పూజలు

బోధన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో మంగళవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని 101 జంటలు లక్ష తమలపాకుల ప్రత్యేక పూజలు చేశాయి. ఆలయ అర్చకులు ప్రవీణ్ మహరాజ్ మాట్లాడుతూ లక్ష తమలపాకుల ప్రత్యేక పూజలతో కోరిన కోర్కెలు అన్నీ నెరవేరుతాయని అన్నారు. 101 జంటలు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకున్నాయని, మంగళవారం తెల్లవారుజాము నుంచే జంటలన్నీ ఒక చోటుకు చేరి లక్ష తమలపాకులను చేర్చి పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాయని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, ఆలయ కార్య నిర్వాహణ అధికారి రాములు, తదితరులున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని, నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. కార్యక్రమ ంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి, సీహెచ్‌వో ప్రదీప్‌కుమార్, ఆనంద్, సౌందర్య, హెచ్ఎం ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపుతో
పింఛన్‌దారుల ఇక్కట్లు!

• నెట్‌వర్క్ లేక.. కళ్లు స్కాన్ కాక ఇబ్బందులు • గంటల తరబడి పడిగాపులు

మద్నూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ గుర్తింపులో పెంఛన్ దారులకు తంటాలు తప్పడం లేదు. బయోమెట్రిక్‌తో సమస్యలు తలెత్తుతుండడంతో ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని అమలు చేస్తోంది. మండలంలోని మారుమూల గ్రామాల్లో నెట్‌వర్క్ సరిగాలేకపోవడం, బీపీఎంలకు నూతన టెక్నాలజీ మొబైల్‌లు అందచేయకపోవడం, ఐరిస్ ముఖాలు, కళ్లు స్కాన్ కాకపోవడంతో వృద్ధులు, చూపు లేని వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల నుంచి ఆసరా పింఛన్లు ఫేస్ రికగ్నేషన్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వేలిముద్రల ఆధారంగా పింఛన్లు ఇస్తున్న విధానంలో లోపాలు ఉండడంతో ఆ సమస్య నుంచి బయటపడేందుకు నూతన విధానం అమల్లోకి తెచ్చింది. పింఛన్‌దారులకు సులభంగా పింఛన్ అందజేసేలా ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా ఫొటోలు తీసి అప్లోడ్ చేసి లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఇందులో సైతం పలువురి ఐరిష్ రాకపోవడంతో మండలంలోని ప్రతీ గ్రామంలో వారిని పక్కన పెడుతున్నారు. అధికారులు తీసుకునే నిర్ణయం ఆధారంగా వారికి పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని బీపీఎంలు చెబుతున్నారు. ప్రతీ గ్రామంలో కొందరైన వృద్ధులకు, కంటి చూపు లేనివారికి ఐరిస్ రావడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం బీపీఎంల ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఇచ్చారు. వారి వద్ద ఉన్న ఫోన్లు పాత టెక్నాలజీ కావడంతో కొంతమంది ఫోన్లు సరిగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆసరా పింఛన్ పొందుతున్న వారిలో కొందరు అనర్హులు ఉన్నారని ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. ఆధార్ కార్డు ల్లో వయస్సు మార్పు నకిలీ పీఎఫ్ కార్డులతో బీడీ పింఛన్లు పొందేవారు ఈ యాప్ ద్వారా బయటపడుతారని తెలుస్తోంది. పారదర్శకంగా పింఛన్లు అందజేసేందుకు యాప్ దోహదపడుతుందంటున్నారు. కానీ ప్రభుత్వం అనుకున్న విధంగా వృద్ధులు చూపులేని వారికి ఇబ్బందులు తప్పడంలేదు.


మద్నూర్ పోస్టాఫీసు పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఉమ్మడి మద్నూర్‌లో 9,780 మంది పింఛన్‌దారులు

రాష్ట్ర ప్రభుత్వం 10 రకాల పింఛన్లను అందజేస్తోంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో 9780 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారిలో వృద్ధులు 4,940, వితంతువులు 3378, వికలాంగులు 1191, ఒంటరి మహిళలు 214, బీడీ కార్మికులు 37మంది ఉన్నారు. వీరికి ప్రతీనెల రూ.2కోట్ల 19లక్షల 62వేల 656 నిధులు పంపిణీ చేస్తున్నారు. ఐరిష్ రానివారు మండల వ్యాప్తంగా వందలాదిగా ఉంటారని గ్రామాల్లోని బీపీఎంల ద్వారా తెలుస్తోంది.

ఆర్మూర్ సబ్‌కలెక్టర్‌గా అభిగ్నాన్ మాల్వియా బాధ్యతల స్వీకరణ

ఆర్మూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ సబ్‌కలెక్టర్‌గా అభిగ్నాన్ మాల్వియా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్మూర్‌కు ఆర్డీవో పాలనాధికారిగా ఉండగా ప్రభుత్వం సబ్ కలెక్టర్ పోస్టును ఆర్మూర్‌కు మంజూరు చేసింది. ఆర్మూర్ పట్టణానికి ఐఏఎస్ అధికారిని సబ్‌కలెక్టర్‌గా నియమించడం ఇదే మొదటిసారి. సబ్‌కలెక్టర్ అభిగ్నాన్ మాల్వియాకు ఆర్డీవో రాజాగౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ అభిగ్నాన్ మాల్వియా

ఆర్మూర్ సబ్‌కలెక్టర్‌ను సన్మానించిన ఏఎంసీ చైర్మన్

సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిజ్ఞాన్ మాల్వియను ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ నాయకులు రవికాంత్‌రెడ్డి, అజ్జు సన్మానించారు. అలాగే ఇదివరకు ఆర్డీవోగా పనిచేసిన రాజాగౌడ్ పదోన్నతిపై హన్మకొండ డీఆర్‌వోగా బదిలీ కావడంతో ఆయనను సైతం పలువురు ఆయనను సన్మానించారు. అనంతరం ఆలూర్ తహసీల్దార్ రమేష్, సిబ్బంది సబ్‌కలెక్టర్‌ను సన్మానించారు.

సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు


ట్రేడ్ లైసెన్స్‌లపై నజర్

• వ్యాపారులను గుర్తించే బాధ్యత జవాన్లు, వార్డు అధికారుల బృందానికి
• నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు • ఆదాయం పెంచే దిశగా చర్యలు

ఎల్లారెడ్డి, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలో లైసెన్సుల జారీ, పునరుద్ధరణ ప్రక్రియ వేగవంతం చేయడానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి వారికి అధికారులు నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని వ్యాపార సంస్థలు నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నాయో లేదో తనిఖీ చేయడానికి కమర్షియల్ భవనాలను పరిశీలించే బాధ్యత జవాన్లకు వార్డు అధికారులకు అప్పగించారు. ఇప్పటివరకు కొంతమంది వ్యాపారులను అధికారులు గుర్తించి వారికి నోటీసులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సంస్థలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. కమర్షియల్ ఇంటి నంబర్లు ఉన్న భవనాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారా? అలా చేస్తే వారికి లైసెన్స్ ఉందా అనేది జవాన్లు వార్డు అధికారులు పరిశీలించి వివరాలను నమో దు చేసుకుని అధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. లైసెన్స్ లేకుం డా వ్యాపారాలు నిర్వహించొద్దని, లేకుంటే జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనల అమలు, పారదర్శకత

వ్యాపారులు నిబంధనలకు లోబడి పని చేస్తున్నాయని నిర్ధారించడానికి ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి. ఈ తనిఖీలతో అక్రమ వ్యాపార కార్యకలాపాలను నివారించవచ్చని అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికి కూడా అధికారులు వెనకాడబోమని హెచ్చరిస్తున్నారు. పట్టణ కేంద్రంలోని వ్యాపారులందరూ తమ లైసెన్స్‌లను పరిశీలించుకోవాలని, గడువు ముగిసినట్లయితే తక్షణమే పునరుద్ధరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. కొత్త లైసెన్స్ కోసం ఆన్‌లన్‌లోనే నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, కార్యాలయానికి వచ్చే అవసరం కూడా లేదని అధికారులు సూచిస్తున్నారు.

సర్కారు ఆదాయం పెంచడమే లక్ష్యం

లైసెన్సులతో వచ్చే ఆదాయం మున్సిపాలిటీ ఆదాయ వనరుల్లో కీలక పాత్ర పోషిస్తుంది. పట్టణంలో భారీ సంఖ్యలో వ్యాపార ,వాణిజ్య సముదాయాలు ఉండి వందలాది మంది వ్యాపారులు నిర్వహిస్తుండగా కొంత మందికి మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక రూపాయలు మాత్రమే ఆదాయం వస్తున్నట్లు సమాచారం. లైసెన్స్ ద్వారా ఆదాయం వచ్చే వీలున్న. ఆ మేరకు లైసెన్సులు జారీ కావడం లేదని తెలుస్తోంది. దీంతో ఆదాయం కోల్పోతుందని భావించి, ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. ఈ చర్యలతో పన్నుల వసూళ్లు పెంచి పట్టణ అభివృద్ధికి నిధులు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం
• మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి



ట్రేడ్ లైసెన్స్‌లు లేని వ్యాపారులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఇప్పటికే జవాన్లకు వార్డు అధికారుల ద్వారా ఈ బాధ్యతలను అప్పగించాం. లైసెన్స్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి వార్డు అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. లైసెన్స్ తీసుకునేలా వ్యాపారులను ప్రోత్సహించాలని సూచనలు చేశాం.

బీర్కూర్ ఐకేపీ ఏపీఎం బదిలీ

బీర్కూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల ఐకేపీ ఏపీఎం గంగాధర్ యాదవ్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏపీఎంగా శిరీష పదవి బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా బదిలీపై వెళ్తున్న ఏ పీఎం గంగాధర్‌కు మంగళ వారం స్త్రీ శక్తి భవనంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయనకు ఐకేపీ సిబ్బంది, మహిళ సమాఖ్య సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతన ఏపీఎం శిరీష, సీసీలు, వీవోఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు

రాజంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త పరీక్షలు చేశామని తెలిపారు. వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ మహమ్మద్ మంజూర్, గంగామణి, స్టాఫ్‌నర్స్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

22 మందికి కంటి పరీక్షలు

బీర్కూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో లయన్స్ డాక్టర్ సతీష్ 22 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ముగ్గురికి మోతి బిందు ఉన్నట్లు గుర్తించారు. వారిని శస్త్ర చికిత్స నిమిత్తం బోధన్ లయన్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



దోమకొండలో మాట్లాడుతున్న ఎస్సై స్రవంతి

విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

దోమకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ విలువైనా జీవితాలను నాశనం చేసుకోకుండా పాఠశాల దశ నుంచే శ్రద్ధగా చదువుకోవాలని దోమకొండ ఎస్సై స్రవంతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఎస్పీ ఆదేశాల ప్రకారం విద్యార్థులకు ఎస్సై ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కళా బృందం, షీం టీం, భరోస సెంటర్ ప్రతినిధులు మూఢనమ్మకాలు, ఆన్‌లైన్ మోసాలతో పాటుగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా పుస్తకాలను చదవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలపై ఆమె విద్యార్థులకు స్పష్టంగా తెలియజేసి అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఏదైనా పనినిమిత్తం వెళ్లాలని సూచించిన ద్విచక్రవాహనాలను నడపవద్దన్నారు. అమ్మాయిలు పట్ల మర్యాదపూర్వకంగా మెదలాలని, అభ్యసంగా ప్రవర్తిస్తే కేసుల నమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రుల ఫోన్లు తీసుకుని ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దన్నారు. అనవసరంమైన యాప్స్‌ను ఓపెన్ చేయవద్దన్నారు. సమాజంలో గుర్తింపు పొందాలంటే బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జానీ పాషా, పీసీలు రమేష్, సాయికుమార్, ఉపాధ్యాయులు బాపురెడ్డి, కళాబృందం సభ్యులు, భరోస సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో కిసాన్ శిక్షణ తరగతుల గూర్చి చర్చిస్తున్న దృశ్యం

రైతుల అభివృద్ధి కోసం కృషి చేద్దాం

సదాశివనగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటే అన్న నినాదంతో భారతీయ కిసాన్ సంఘ్ రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలవారీగా నిర్వహించబోయే రైతు శిక్షణ తరగతులపై రైతువేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న మండలంలోని కుప్రియాల్ గ్రామంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందుకోసం మండలంలోని ప్రతిరైతు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. శిక్షణ కార్యక్రమాలు మండల వారీగా పదవ తేది నుండి ప్రారంభం కానున్నాయని ఉదయం 8గంల నుండి సాయంత్రం 4గంటల వరకు ఈ శిక్షన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రైతులకు ఎదురమ్యే సమస్యలు, జరిగే నష్టాలు, సేంద్రియ వ్యవసాయం సాగు పద్ధతి లాంటి పరిష్కారం సూచనలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గైని నాగేశ్వర్, జోనల్ అధ్యక్షుడు అంక వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, కార్యదర్శి మార నారాయణ రెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

అడవులను రక్షించాలి

• గిరిజన నాయకుల డిమాండ్

గాంధారి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలో అటవీ భూములను రక్షించాలని మండల గిరిజన నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ అనాది కాలం నుండి అడవులు, కొండ ప్రాంతాల్లోనే నివాసం ఉంటూ అడవినే నమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తూ బ్రతుకుతున్న లంబాడా అటవీ భూములను కాయతీ లభాన్ పోడు భూముల పేరుతో అడవులను వేల ఎకరాల్లో కొట్టుకుని గుట్టను దారుణంగా నాశనం చేస్తున్నారని, కాయతీ లభాన్లపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గాంధారి మండల కేంద్రంలో వేల ఎకరాలు అటవీ ప్రాంతం ఉండేదని ప్రస్తుతం ఏమి కూడా మిగలకుండా అటవీ ప్రాంతాన్ని కబ్జా చేశారని అటవీ ప్రాంతాన్ని కాపాడాలని అన్నారు. బుధవారం డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేయడానికి గిరిజనులు ఏకమై తరలిరావాలని పిలుపునిచ్చారు. అటవీశాఖ అధికారులు స్పందించి వెంటనే అడవీ బూములను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోజీరామ్, హెమ్‌సింగ్, ప్రేమ్‌దాస్, దేవిసింగ్, రవి, రమేష్, జేత్రం, దశరథ్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు టీకాలు వేయాలి



గొర్రెకు నీలి నాలుక వ్యాధి టీకాలను వేస్తున్న వైద్యాధికారి

రామారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, మేకలకు నీలి నాలుక వ్యాధి టీకాలను సక్రమంగా వినియోగించాలని కామారెడ్డి జిల్లా జెడిఎ డాక్టర్ భాస్కరన్ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో మంగళవారం గొర్రెలు, మేకలకు మంగళవారం నీలి నాలుక టుకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్య జేడీఏ డాక్టర్ భాస్కరన్ నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాల పెంపకం దారులకు పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. నీలి నాలుక అనే వ్యాధి వైరస్ కారణంగా వస్తుందని, ఇది వర్షాకాలంలో ఈగలు, దోమల వళ్ళ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన జీవాలు అధిక జ్వరంతో బాధపడతాయని పెదాలు వాపు ఉంటుందని, నాలుక నీలిరంగులో మారుతుందని అందుకే ఈ వ్యాధికి నీలి నాలుక అంటారని వివరించారు. వ్యాధి సోకిన జీవాలు నోటిలో, కాలి గిట్టలలో పుండ్లు కావడం వలన మేత మేయలేవని వివరించారు. ఈ వ్యాధి నివారణకు వర్షాకాలంలో తప్పకుండా నివారణ టీకా వేయించుకోవాలని సూచించారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ టీకాను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని గొర్రెల పెంపకం దారులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచందర్ మాట్లాడుతూ నిర్వహించిన కార్యక్రమంలో 702 జీవాలకు టీకాలు వేసినట్లు తెలిపారు. వ్యాధి సోకిన జీవాలు ఉన్నట్లయితే వాటికి పశువైద్యాధికారి సూచించిన విధంగా వైద్యం చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఎం. శ్రీనివాస రావు, విఎల్ ఓ నారాయణ, జెవిఓ రమేష్, కింది స్థాయి సిబ్బంది గొర్రెల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలి

మహమ్మద్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా దుకాణదారులు వాటికి సంబంధించి బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటుగా నర్వ, మహమ్మద్‌నగర్, కోమలంచ, ముక్తుంపూర్, తుంకీపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను రిజిస్టర్లను పరిశీలించి దుకాణదారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందుగా మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షించి రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రైతువేదిక ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా సిబ్బంది, రైతులతో కలిసి మొక్కలు నాటారు. నర్వ, తూంకీపల్లిలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఈపీఓఎస్ యంత్రం ద్వారా విక్రయించాలని, ప్రతి దుకాణంలో స్టాక్ వివరాలు, ఎరువుల వివరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు అమీనా, ఏవో నవ్య, ఏఈవోలు రేణుక, మధుసూదన్‌రావు, రైతులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలి

తాడ్వాయి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. ఈయన మంగళవారం మండలంలోని నందివాడ, ఎర్ర పహాడ్ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రతి గ్రామంలో పూర్తయ్యేటట్లు చూడాలని అధికారులకు ఆదేశించారు ఇందిరా ఆవాస్ యోజన కింద అర్హులైన లబ్ధిదారులను అన్‌లైన్ నమోదు చేయాలని తెలిపారు. నిర్మించుకున్న ఇండ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూపాయలు త్వరగా వచ్చేలా చూడాలని ఆయా గ్రామ కార్యదర్శి తెలిపారు. అనంతరం గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు అన్నారు. చిన్న పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. గ్రామాల్లో భారీ శుద్ధ పనులను చేపట్టాలని ఆయా గ్రామా కార్యదర్శులకు తెలిపారు. ఇందులో మండల అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రాజంపేట సొసైటీలో వన మహోత్సవం

రాజంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించినట్లు చైర్మన్ నల్లవెల్లి అశోక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవం సందర్భంగా చెట్లు నాటడం జరిగిందని చెట్లు నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఒక్కొచెట్టు చొప్పున నాటాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు మల్లగారి బాలయ్య, సుధాకర్‌రెడ్డి, సాయిబాబా, బస్వయ్య, సునీత, నర్సవ్వ, సీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెంచీల అందజేత

కామారెడ్డిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్‌సీ వాడ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఐడీబీఐ బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధుల నుండి డెస్క్ బెంచీలు, కంప్యూటర్,బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బల్లలు, ఫ్యాన్‌లు డీఈవో రాజు చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ హెడ్ వెంకటేష్,ఎంఈవో ఎల్లయ్య, ఏజీఎం శ్రీధర్, బ్యాంక్ మేనేజర్ రాజు, సహాయమేనేజర్ ప్రవీణ్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రాజంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు భీరయ్య తల్లి ఇటివల మరణించింది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆయన స్వగృహానికి వెళ్లి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయనవెంట మాజీ ఎంపీపీ నీరడి శంకర్, సీనియర్‌నాయకులు కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్‌పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తాటి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయాధికారిగా చంద్రశేఖర్ నియామకం

కామారెడ్డి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):జిల్లా కోర్టులో 30 సంవత్సరాల పాటుసీనియర్ న్యాయవాదిగా ఉన్న తాటి చంద్రశేఖర్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా హైకోర్టు ఆదేశాలతో నియమితులయ్యారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కోర్టులో మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌ను సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాకోర్టులోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేలా న్యాయమూర్తి చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కరించేలా కృషిచేయాలన్నారు. న్యాయమూర్తికి న్యాయవాదులంతా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు నందరమేష్,అడిషనల్ పీపీ సూర్యప్రసాద్,సీనియర్ న్యాయవాదులు సిద్దిరాములు, లింగపూర్ శ్రీను, దేవరాజు, శ్రావణ్‌గౌడ్,రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు అనిల్‌కుమార్

ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

● యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవుల్లా, ఎస్‌సీ, ఎస్‌టీయూ ఎస్‌జీహెచ్‌ఏ అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఏపీఎంకు అదనపు బాధ్యతలు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ఐకేపీ ఏపీఎం రాంనారాయణ గౌడ్‌కు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నాగిరెడ్డిపేట ఏపీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఐకేపీ ఏపీఎంల బదిలీల్లో భాగంగా నాగిరెడ్డిపేట ఏపీఎం జగదీష్ కుమార్ బదిలీ కావడంతో అతని స్థానంలో కొత్తగా ఏపీఎంను జిల్లా అధికారులు ఎవరిని నియామించలేదు. దీంతో ఈ నెల 4న సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో నాగిరెడ్డిపేట ఏపీఎం ఎవరు? అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఎల్లారెడ్డి ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న ఎం.రాంనారాయణ గౌడ్‌కు నాగిరెడ్డి పేట ఏపీఎంగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాంనారాయణ గౌడ్ నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



బీబీపేట సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేస్తున్న దృశ్యం

సబ్ స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

దోమకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రైతులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం కరెంట్ వ్యవసాయానికి చాలా కోతలు విధిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం 18గంటలు మాత్రమే కరెంట్ మాత్రమే వస్తుందని ఎట్టిపరిస్థితిలో 24గంటల కరెంట్ ఇవ్వాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెంట్ కోతలపై సబ్ స్టేషన్ సిబ్బందిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాదానాలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అల్బెండజోల్ మాత్రలను వేయాలి

భిక్కనూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భిక్కనూరు మండల వైద్యాధికారి యేమిమా సిబ్బందికి సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది, ఆశాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడు తూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలతో పాటుగా కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో సంవత్సరం పిల్లాడి దగ్గర నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన బాల, బాలికలకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రను వేయాలన్నారు. ఎవరైనా తప్పితే 18న వారికి వేయాలని సూచించారు. యుక్త వయస్సులో వచ్చే రక్తహీనత, యుక్త వయసులో తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి గ్రామాల్లో సిబ్బంది, ఆశాలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, సిబ్బంది. ఆవాలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

లింగంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు రూ.84000 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన మూగ బాలరాజు, సర్వేశ్‌లకు వైద్యం ఖర్చుల కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ సీఎంఆర్‌ఎఫ్ నిధులను మంజూరు చేయగా కాంగ్రెస్‌పార్టీ లింగంపేట టౌన్ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నగేశ్, అశోక్, వినోద్, సాయిలు, శివలాల్, మల్లయ్యలు చెక్కులను పంపిణీ చేశారు.



ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న బాన్సువాడ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

ఢిల్లీ ధర్నాలో బాన్సువాడ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

బాన్సువాడ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం జరిగిన ఈపీఎస్ 95 పెన్షన్‌దారుల ధర్నాలో బాన్సువాడ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కనీస పెన్షన్‌ను 1000 నుండి 7500కు పెంచాలని , డీఏ , భార్య , భర్తలకు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో అన్ని రాష్ట్రాల పెన్షన్ దారులతో పాటు బాన్సువాడ నుండి యేషయ్య , కౌసర్ , మహమూద్ , నాగ్‌నాథ్ , గంగారాం తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

• మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక దయానంద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణ పనులు లబ్ధిదారు త్వరగా చేపడితే విడుతల వారీగా లబ్ధిదారులకు బిల్లులను అందజేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, ఆయా గ్రామల పంచాయతీ సెక్రెటరీలు సౌందర్య, హనుమవ్వ సవిత, శంకర్ సుధాకర్, రాజేష్, ఫయాజ్, తదిత రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు


కామారెడ్డి,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కామారెడ్డి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిని అత్యంత సన్నిహితుడైన డీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ దేవరాజుగౌడ్ వారం రోజుల కిందట కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

మొక్కజొన్న పంట ఎదుగుదలపై అవగాహన

కామారెడ్డి రూరల్, ఆగస్టు 05 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో గల వ్యవసాయ రైతు వేదికలో మంగళవారం రైతులకు వీడియోకాన్ఫరెన్సు ద్వారా పంటల సాగు పై అవగాహన కల్పించినట్లు ఏఈవో దేవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసే మొక్కజొన్న పంటలో ఎక్కువగా కత్తెర పురుగు వస్తుండడంతో దాని నివర్ణకు తీసుకోవాల్సిన మందులను వాడినట్లయితే మొక్కజొన్నకు కత్తెర పురుగు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని వీడియోకాన్ఫరెన్సు ద్వారా వ్యవస్థాయ శాస్త్రవేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఏఎంసీ అభివృద్ధికి రూ.2.34 కోట్లు మంజూరు

ఎల్లారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ. 2.24 కోట్ల నిధులు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మారెడ్డి రజితారెడ్డి తెలిపారు. మంగళవారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషి వల్లే ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట్ మూడు మండలాలకు సంబంధించిన రైతుల సమస్యల పరిష్కారం కోసం నూతన భవనానికి నిధులు మంజూరు అయ్యాయని 2.34 కోట్ల నిధులతో నూతన భవనం 83.80 లక్షలు పది దుకాణాల సముదాయాల నిర్మాణానికి రూ.83.80 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం 13 లక్షలు, 100 మెట్రిక్ టన్నుల వెయిట్ బ్రిడ్జి నిర్మాణం కొరకు 32.50 లక్షలు మంజూరు అయ్యాయని వాటి నిధుల మంజూరు కొరకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం జారీ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకట్ రామ్‌రెడ్డి, డైరెక్టర్లు శంకరయ్య పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - సార్ మేడమ్

ప్రియా 70 - హరిహర వీరమల్లు

ప్రియా 35 - మహావతర్ నరసింహ

బాన్సువాడ

మహేశ్వరి - కింగ్‌డమ్

వెంకటేశ్వర - మహావతార్ నరసింహా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

